సాక్షి జనగామ

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఏపీఎం రవి తెలిపారు.

- 11లో▸



కుల సంఘాలపై తప్పుడు ప్రచారం

కుల సంఘాలపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సేవెల్లి సంపత్ అన్నారు.

- 11లో▸

గరిష్టం/కనిష్టం
30^0 / 17^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం మంచు కురుస్తుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పూలే అవార్డు ప్రదానం



జనగామ: కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ జాతీయ మహాత్మా జ్యోతిబా పూలే అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సాహిత్య అకాడమీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ, ప్రజాకవి, గాయకులు జయరాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సీనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



వెంకటేష్

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన కొమురమల్లు - కొంరమ్మ దంపతుల కుమారుడు బండి వెంకటేష్ నవంబర్ 4వ తేదీ నుంచి 8 వరకు జమ్ము కాశ్మీర్‌లో జరిగే సీనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు నుంచి పాల్గొంటున్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడు వెంకటేష్‌ను సర్పంచ్ మానస, ఎంపీటీసీ ఝాన్సీ, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, హెచ్ఎం నర్సింహారెడ్డి, పీహెచ్‌డీ జీడి రమేష్, జీడి జాన్, బొట్టు చేరాలు, చిర్ర నాగరాజులు తదితరులు అభినందించారు.

బీజేపీ గెలుపు ఖాయం



జనగామ: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చాటుకుని, తెలంగాణలో అధికారంలోకి రాబోతుందని బీజేపీ జనగామ నియోజకవర్గ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 23వ వార్డు బీరప్పగడ్డకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరగా, ఆయన కండువా కప్పి స్వాగతం పలికారు. అంతకు ముందు వార్డులో గడపగడపకు వెళ్లి ఇంటింటా ప్రచారం నిర్వహించి పువ్వు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయన వెంట నాయకులు కేవీఎల్ఎన్‌రెడ్డి, పవన్ శర్మ, తోకల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ విషయాలపై రచనలు కొనసాగాలి

హన్మకొండ కల్చరల్ : సమాజంలో జరుగుతున్న విషయాలపై రచనలు కొనసాగించాలని పలువురు కవులు, రచయిత్రులు పేర్కొన్నారు. వరంగల్ శ్రీలేఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కవయిత్రి బిట్ల అంజనీదేవి రచించిన 'మన సెందుకో సున్నితం' తొలికవితా సంపుటిని ఆదివారం గవర్నమెంట్ ప్రాక్టీసింగ్ ప్రైమరీ స్కూల్ సెమినార్ హాల్‌లో ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు కాత్యాయనీ విద్మహే ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంజనీదేవి కవిత్వాలను పరిశీలిస్తే సామాజిక భావజాలం అర్థమవుతుందన్నారు. ప్రముఖ రచయిత్రి, కవయిత్రి అనిశెట్టి రజిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో నిష్ణాతులుగా ఉండాలని అన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన కళావతి మాట్లాడుతూ కవిత్వం టైంపాస్ వ్యవహారం కాదని, ఒక దృక్పథంతో రచనలు చేయడమనేది ఆచరణ నుంచే సాధ్యమవుతుందని చెప్పారు. సంస్థ అధ్యక్షుడు టి.శ్రీరంగస్వామి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు పొట్లపల్లి శ్రీనివాసరావు, కొమ్రాజు రామలక్ష్మి, బిల్ల మహేందర్, ఉప్పలయ్య, అస్నాల శ్రీనివాస్ ప్రసంగించారు. పి.చంద్, డాక్టర్ బండారు సుజాత, వకుల వాసు, గట్టు రాధిక, అనిత, మాదారపు వాణిశ్రీ, లింగారెడ్డి, తాటిపాముల రమేష్, ప్రదీప్, సుదర్శన్, శ్రీమన్నారాయణ, అడప రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

మానుకోట చైతన్యబాట

- మొదటి నుంచి వైవిధ్య ఫలితాలే
- ఆరుసార్లు కాంగ్రెస్ విజయం
- ప్రతీసారి వినూత్న ఓటింగ్

ఆర్థిక సహకారం అందించాలి

- జీవనోపాధి కోసం ప్రణాళిక ఉండాలి
- మహిళా సంక్షేమానికి మరింత కృషి చేయాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో కస్తూర్బా మహిళా పొదుపు సంఘం బాధ్యుల స్పష్టీకరణ

- 10లో▸

మూడోకన్ను!



నిఘా నీడలో ప్రచారం

- రౌండ్ ద క్లాక్ సీసీ కెమెరా
- ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వెలెన్స్, స్టాటిక్ సర్వెలెన్స్ చెక్ పోస్టులు

జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, రాజకీయ పార్టీల ప్రచారంపై ఎన్నికల సంఘం మూడో కన్ను నిఘా ఉంచింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆధ్వర్యంలో ఎలక్షన్ నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. నామినేషన్‌ల ఘట్టానికి మరో 13 రోజులు ఉన్నప్పటికీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకు పోతున్నారు. గ్రామ ముఖ్య కూడళ్లలో ప్రసంగాలు, ర్యాలీలు చేపడుతుండగా.. రౌండ్ ద క్లాక్ సీసీ కెమెరాలు, వీడియో సర్వెలెన్స్ బృందాలు కెమెరాల్లో నిక్షిప్తం చేస్తున్నారు. ప్రచారంలో ఖర్చులను పక్కాగా తేల్చేందుకు ఎన్నికల వ్యయం విభాగం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రస్తుతం అభ్యర్థులతో పాటు పార్టీ శ్రేణుల కదలికలను గమనిస్తున్నారు.

రెవెన్యూ అధికారుల పాత్ర కీలకం

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల నిర్వహణ పనుల్లో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకంగా మారుతుంది. జిల్లాలో ఆర్డీవోలు, అదనపు కలెక్టర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా పని చేస్తున్నారు. ఎలక్షన్‌కు సంబంధించి ఆయా శాఖలను సమన్వయం చేస్తూ, ఎన్నికలు ముగిసే వరకు ఎలక్షన్ కమిషన్‌కు జవాబు దారిగా వీరే ఉంటారు. ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వసతుల కల్పన, స్క్వాడ్‌ల ఏర్పాటు, ఎన్నికల నియమావళికి సంబంధించిన పనుల్లో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకం.

సాంకేతికత వినియోగం..

ఎన్నికల నిర్వహణలో సాంకేతికత వినియోగం బాగా పెరిగింది. ఇందు కోసం ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకంగా ఐటీ విభాగం ఏర్పాటు చేశారు. నిపుణుల బృందం టెక్నాలజీ వినియోగంపై దృష్టి సారిస్తూ, అభ్యర్థుల ప్రచార కదలికలు.. పోలింగ్ కేంద్రాలు, సువిధ, సీవిజిల్ తదితర యాప్‌లను వినియోగిస్తూ పర్యవేక్షిస్తున్నారు. బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్‌తో పాటు ఓటింగ్ సమయంలో వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ, కౌంటింగ్ తదితర వివరాలను ఆన్‌లైన్‌కు అనుసంధానం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం





కారును తనిఖీ చేస్తుండగా వీడియో తీస్తున్న వీడియోగ్రాఫర్

ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పాత్ర కీలకం. ఎన్నికల పారదర్శకంగా నిర్వహించేందుకు వీరి సేవలను వినియోగించుకుంటారు. పీఓ (పోలింగ్ అధికారి), ఏపీఓలుగా అధిక సంఖ్యలోఉపాధ్యాయులే పనిచేస్తారు. ఎలక్షన్ విధులు నిర్వర్తించే అధికారులకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై శిక్షణ ఇవ్వగా, మరోసారి ఇవ్వనున్నారు.

అత్యవసర సమయంలో వైద్యసేవలు

పోలింగ్ కేంద్రాల వద్ద అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది నియామకం పూర్తయింది. పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే సెంటర్లతో పాటు ఓటింగ్ సమయంలో వైద్య సిబ్బంది సేవలు అందిస్తారు.

సహాయ వ్యయ పరిశీలకులు

ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, జి.ప్రియాంక, సహాయ వ్యయ పరిశీలకులు, జనగామ, వి.వేణుగోపాల్, సహాయ స్టేషన్‌ఘన్‌పూర్, బి.దివ్య, సహాయ వ్యయపరిశీలకులు, పాలకుర్తి.

ఎన్నికల వ్యయ మానిటరింగ్ సెల్ (ఈఈఎంసీ)

వై.రాజేందర్‌రెడ్డి, టీమ్ హెడ్, నోడల్ ఆఫీసర్, జి.మురళీరామన్, ఎండీ ముజమ్మిల్, టీమ్ మెంబర్లు

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు

టి.అశోక్, నవీద్ ఫరూఖీ, అకౌంటింగ్ టీం ఆఫీసర్లు, జనగామ, జె.శ్రవణ్‌కుమార్, ఎస్ దిలీప్ కుమార్, అసిస్టెంట్లు, జనగామ, టి.ఉమాశంకర్, అకౌంటింగ్ టీం ఆఫీసర్, స్టేషన్‌ఘన్‌పూర్, ఎండీ అబ్దుల్ ఇంతియాజ్, అసిస్టెంట్, స్టేషన్‌ఘన్‌పూర్, సీహెచ్. స్వర్ణలత, అకౌంటింగ్ టీం ఆఫీసర్, పాలకుర్తి. సందీప్, అసిస్టెంట్, పాలకుర్తి.

సీ విజిల్ టీం

బి.విజయ, కె. సునిత, బి.శ్రీనివాస్, బి.సాయి కిరణ్, పి.స్విజన్. బి.దినేష్.

జిల్లా గ్రీవెన్స్ కమిటీ

కె.అనిల్ కుమార్(జెడ్పీ సీఈఓ), వై.రాజేందర్‌రెడ్డి (డీసీఓ), నర్సింహారెడ్డి(జిల్లా ట్రెజరరీ ఆఫీసర్). ఎన్నికల సమయంలో చెక్‌పోస్టులు, అధికారులు సీజ్ చేసిన వస్తువులు, నగదుకు సంబంధించి లెక్కలు సరి చూసుకుని, రిలీజ్ చేస్తారు. లేదా ఎలక్షన్ కమిషన్‌కు అప్పగిస్తారు.

సోషల్ మీడియా పర్యవేక్షణ టీం

ఫేక్ న్యూస్‌తో పాటు సోషల్ మీడియాలో ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలు పాటించని పోస్టులపై ఈ టీం పర్యవేక్షిస్తుంది.

కె.రాంప్రసాద్ (డీఐఓ,ఎన్ఐసీ), రాజేంద్రప్రసాద్ (డీపీఆర్ఓ), సీహెచ్ దుర్గారావు(ఈడీఎం), జి.బాలుమహేందర్ (హెచ్‌హెచ్‌పీ, కలెక్టరేట్), ఎస్ సతీష్ (డాటా ఎంట్రీ ఆపరేటర్), కె.రాకేష్ (సోషల్ మీడియా నిపుణులు), సీహెచ్ రాంబాబు(పోలీసు) ఉన్నారు.

వీడియో వీక్షణ బృందం

దామోదర్‌రావు (హౌసింగ్ ఈఈ), రాజేంద్రప్రసాద్ (డీపీఆర్ఓ), సీహెచ్ దుర్గారావు (ఈడీఎం), ఏ.సతీష్ (డాటా ఎంట్రీ ఆపరేటర్).

బందోబస్తు చర్యల్లో పోలీసు శాఖ

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ రంగంలోకి దిగింది. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి నిఘా పెంచారు. ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకుంటున్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికే ఆయా పంచాయతీల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాజకీయ సభలు నిర్వహించే ప్రాంతాల్లో నిఘా పెంచారు. సరిహద్దు ప్రాంతాల నుంచి మద్యం, డబ్బు రవాణా జరగకుండా చెక్ పోస్టులను ఏర్పాటు, తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు.

మానవతావాది బాలయ్య

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిద్దారెడ్డి



మాట్లాడుతున్న నందిని సిద్దారెడ్డి

జనగామ: మానవతా విలువలతో కూడిన ఆదర్శవాది కొలిపాక బాలయ్య అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓంసాయి గార్డెన్‌లో కవులు, కళాకారుల ఐక్యవేదిక జిల్లా ఆధ్వర్యంలో డాక్టర్ పోరెడ్డి రంగయ్య అధ్యక్షతన జరిగిన కవి, రచయిత, విశ్రాంత ఆదర్శ ఉపాధ్యాయుడు కొలిపాక బాలయ్య 85వ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఆయన రచించిన నా జీవన ప్రస్థానం (ఆత్మకథ), భావ విపంచిక (మినీ కవితలు) పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం సిద్దారెడ్డి మాట్లాడుతూ బాలయ్యను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అందరిని ఐక్యం చేసే విధంగా కవిత్వాలు ఉపయోగపడుతుంటే, రాజకీయాలు మాత్రం అందరినీ విడదీస్తాయన్నారు. సాహిత్యకారులు ప్రతీ అంశాన్ని ఒక హిత సభగా మార్చుకోవాలని సూచించారు. బాలయ్య 85వ జన్మదినం పురస్కరించుకుని వివిధ రంగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి పలువురికి విశిష్ట పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్లు బలరాం నాయక్, కె.రామకృష్ణ, జి. నరసింహారావు, డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, పెట్లోజు సోమేశ్వరాచారి, పానుగంటి రామ్మూర్తి, డాక్టర్ పెద్ది వెంకటయ్య గౌడ్, నల్ల విష్ణువర్ధన్‌రెడ్డి, నడికట్టు మహేందర్‌రెడ్డి, జి కృష్ణ, అయిలా సోమనసింహాచారి, కోడం కుమారస్వామి, లగిశెట్టి ప్రభాకర్, మహంకాళి రాజేశ్వర్, విజయ్ కుమార్ బజాజ్, పొట్టబత్తిని భాస్కర్ పాల్గొన్నారు. అలాగే లింగాలఘణపురం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జనగామ శంకర్‌కు విశిష్ట సేవా పురస్కారం, చిల్పూరు మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన జీడి రమేష్ అత్యంత విశిష్టమైన సాహిత్య సేవా పురస్కారం అందుకున్నాడు.

పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ రావాలి



పార్టీ కండువా కప్పుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పార్టీ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పల్లా నివాసంలో జరిగిన కార్యక్రమంలో తరిగొప్పుల, నర్మెట, మండలాల పరిధిలోని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు.

ఆదరిస్తే పాలేరులా పని చేస్తా

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆదరించి గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలను తీరుస్తూ పాలేరులా పని చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇటుకాలపల్లి, రామచంద్రాపూర్, కొన్నె, దబ్బగుంటపల్లి, లింగంపల్లి, మన్‌సాన్‌పల్లి, సాల్వాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాష్ట్ర నాయకులు మండల శ్రీరాములు, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు చెంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, సర్పంచ్‌లు రజిత, లక్ష్మి, వెంకట్‌గౌడ్, మల్లేశం, తార, లక్ష్మి, నాయకులు లతశ్రీ,కృష్ణంరాజు, కనుకయ్య, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బల్లార్షా ప్యాసింజర్ రద్దు

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలో ప్రయాణించే బల్లార్షా-కాజీపేట(17036) వెళ్లే ప్యాసింజర్ రైలును దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం రద్దు చేశారు. ఈ మేరకు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. సెక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థ అప్‌గ్రేడ్, మూడో రైల్వేలైన్ నిర్మాణం, రైల్వే ఇంజనీరింగ్ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఈఓ రామ్




శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

- జిల్లా విద్యాశాఖ అధికారి రామ్

జనగామ: ఆత్మరక్షణ కోసం ప్రతిఒక్కరు మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు పొందాలని, ముఖ్యంగా అమ్మాయిలు ఇందులో శిక్షణ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం నందన గార్డెన్స్‌లో జిల్లా సమురాయ్ అధ్యక్షుడు విక్రమ్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ సమురాయ్ ఫెడరేషన్ శిక్షణా తరగతుల్లో డీఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఉండడానికి దోహదం చేస్తుందన్నారు. అమ్మాయిలకు శిక్షణ తప్పనిసరి అనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కరాటే తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. సమురాయ్ శిక్షణ రాష్ట్రంలో మొదటి సారిగా జనగామ జిల్లాలో ప్రారంభించడం సంతోషమన్నారు. ఇలాంటి శిక్షణలు మరిన్ని రావాలన్నారు. ఈ శిక్షణా తరగతులకు జనగామ, బచ్చన్నపేట, నర్మెట, ఎర్రగొల్లపహాడ్‌తో పాటు మహారాష్ట్ర, నల్లగొండ, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి 150 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సమురాయ్ రాష్ట్ర అధ్యక్షుడు భీమా ఉదయ్, మాస్టర్స్ చంద్రశేఖర్, రవి, పాయం సురేష్, సందేశ్, రవి, సయ్యద్, ఆసిర్ పఠాన్, అన్సారీక్ పర్వాన్, రియాజొద్దీన్, వెంకటేశ్వర రావు, శ్రీనివాస రావు, వేణుమాధవ్ రావు, చంద్రశేఖర్ రావు, కృష్ణ, వెంకటేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం



రక్తదానం చేస్తున్న ఏసీపీ, సీఐ

స్టేషన్‌ఘన్‌పూర్: విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఘన్‌పూర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో మాగార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 65 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. శిబిరంలో ఏసీపీతో పాటు సీఐలు, ఎస్ఐలు, పోలీస్‌సిబ్బంది, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, అదేవిధంగా రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. రక్తం ఏ ఫ్యాక్టరీలో తయారు కాదని, ఆరోగ్యవంతులైనా ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ఏసీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు సట్ల రాజు, ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐలు నాగరాజు, హరిక్రిష్ణ, వినయ్, రఘుపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నోరు విప్పితే పచ్చి అబద్ధాలు

- బీజేపీ అభ్యర్థి గుండె విజయరామారావు



సమావేశంలో మాట్లాడుతున్న విజయరామారావు

లింగాలఘణపురం: సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం నోరు విప్పితే పచ్చి అబద్ధాలు చెప్పడమే తప్ప మరొకటి లేదని బీజేపీ అభ్యర్థి గుండె విజయరామారావు విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ అధ్యక్షుడు గొరిగె సంపత్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం, దళిత సీఎం, దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రుణమాఫీ అంటూ పదేళ్లు పాలన చేసిన సీఎం కేసీఆర్ ఏ ఒక్కటి అమలు చేయకుండా మరోసారి అధికారంలోనికి రావడానికి పచ్చి అబద్ధాలు చెడుతున్నాడని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ ద్రోహి అంటూ కడియం శ్రీహరిని విమర్శించిన కేసీఆర్ నేడు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే టికెట్ కూడా ఇచ్చారని, కాలిగోటికి సరిపోవని ఆనాడు కడియం శ్రీహరి మంత్రి హరీశ్‌రావును విమర్శించగా నేడు అతనికే ఓటు వేయాలని హరీశ్‌రావు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు దూసరి విజయ్, బాబురావు, నాగరాజు, వీరస్వామి, లింగాల ఆదిత్య, నాగరాజు పాల్గొన్నారు.

హాస్టల్ డిపాజిట్లు రెట్టింపు

- కేయూ అధికారుల తీరుతో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలు..
- తగ్గించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిక



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీజీ, ఇంజనీరింగ్, ఫార్మా తదితర కోర్సుల్లో అడ్మిషన్లకు గతంలోనే ఫీజులు భారీగా పెంచిన వర్సిటీ అధికారులు.. హాస్టళ్ల డిపాజిట్లను గతంకంటే రెట్టింపు చేశారు. ఈ విద్యా సంవత్సరం(2023-24) యూనివర్సిటీలో వివిధ కోర్సులకు అడ్మిషన్లు పొందిన విద్యార్థులు హాస్టళ్లలో వసతి, మెస్ సదుపాయం పొందాలంటే అందుకు సంబంధించి హాస్టల్ డిపాజిట్లు(డబ్బులు) చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్లను రెట్టింపు చేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ చర్యను వివిధ విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

డిపాజిట్ల పెంపు ఇలా..

గతంలో రెగ్యులర్ కోర్సుల్లో ఓసీ విద్యార్థులకు హాస్టల్ డిపాజిట్ రూ.6వేలు ఉండగా ఇప్పుడు రూ.12వేలకు పెంచారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల విద్యార్థులకు రూ.6,500 ఉండగా.. రూ.12,500, రెగ్యులర్ కోర్సుల బీసీ విద్యార్థులకు రూ.5వేలు ఉండగా రూ.10వేలు, ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు రూ.6వేలు ఉండగా రూ.12వేలు, రెగ్యులర్ కోర్సుల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.3వేలు ఉండగా రూ.8వేలు, ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు రూ.3,500 ఉండగా రూ.8,500, రెగ్యులర్ కోర్సుల పీహెచ్‌సీ విద్యార్థులకు రూ.1,000 ఉండగా ఇప్పుడు రూ.6వేలకు, ఎస్ఎఫ్‌సీ పీహెచ్‌సీ విద్యార్థులకు రూ.1,000 ఉండగా రూ.6వేలకు పెంచారు. ఇక పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సుల పరిశోధకులకు హాస్టల్ డిపాజిట్లు రూ.5వేలు ఉండగా ఇప్పుడు రూ.10వేలు చేశారు. అంతేకాకుండా హాస్టల్ వసతి కోసం చేసే అప్లికేషన్ ఫారం, మెస్‌కార్డుకు రూ.60 ఉండగా ఇప్పుడు రూ.200 చేశారు.

డిపాజిట్ చెల్లిస్తేనే వసతి, మెస్ సౌకర్యం

ఈ విద్యా సంవత్సరం(2023-24) హాస్టల్స్‌లో నూతనంగా వసతి పొందే అన్ని కోర్సుల విద్యార్థులు పెంచిన డిపాజిట్లు చెల్లించి వసతి, మెస్ సౌకర్యం పొందాల్సి ఉంటుంది. ఒకేసారి అంతమొత్తంలో డిపాజిట్లు పెంచడంపై విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పెంచిన డిపాజిట్ తగ్గించాలని ఇటీవల బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్యకు విన్నవించి వినతిపత్రం అందజేశారు. తగ్గించకుంటే ఆందోళన బాటపడతామని హెచ్చరిస్తున్నారు.

ఈ ఏడాది నుంచి హాస్టల్ వసతి..

గత విద్యాసంవత్సరం పీజీ ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడ్డారు. సీపీగేట్‌లో అర్హత సాధించి కేయూలో పీజీ కోర్సు సీట్లు పొందిన విద్యార్థులకు ఈ ఏడాది నుంచి హాస్టల్ వసతి కల్పించనున్నారు. ఈ మేరకు రెండు దశల్లో సీట్లు పొందిన వారికి ఈనెల 30 నుంచి హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు హాస్టళ్ల డైరెక్టర్ వై.వెంకయ్య తెలిపారు. అలాగే బీఫార్మసీతో పాటు వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కూడా కల్పిస్తున్నామని చెప్పారు.



హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై.వెంకయ్యకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

మూడేళ్ల తర్వాతే పెంచాం..

గత మూడేళ్లుగా హాస్టళ్ల డిపాజిట్ రేట్లు పెంచలేదు. ఈ విద్యాసంవత్సరంలోనే పెంచాం. మిగతా వర్సిటీలతో పోలిస్తే కేయూలో డిపాజిట్ల రేట్లు తక్కువగా ఉన్నాయి. విద్యార్థులు హాస్టల్ అడ్మిషన్, వసతి, మెస్ సౌకర్యం కోసం చెల్లించే ఈ డిపాజిట్ డబ్బులు తిరిగి కోర్సు పూర్తయ్యాక మెస్ బకాయిలు ఏమైనా ఉంటే మినహాయించి తిరిగి చెల్లిస్తున్నాం.

- వై.వెంకయ్య, కేయూ హాస్టళ్ల డైరెక్టర్

మల్లికార్జున్‌ఖర్గేను కలిసిన ఇందిర



మల్లికార్జున్‌ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇందిర


స్టేషన్‌ఘన్‌పూర్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావుఠాక్రేను స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి తనకు ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి టికెట్ కేటాయించడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్ఎఫ్ జవాన్ల కవాతు

పాలకుర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పాలకుర్తి మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా, పోలీస్‌స్టేషన్ వరకు సివిల్ పోలీసులు, బీఎస్ఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు భంగం కలించడానికి ప్రయత్నించే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని, సజావుగా జరిగే విధంగా ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ విపుల జైస్వాల్, పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, పాలకుర్తి, కొడకండ్ల ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, బండి శ్రవణ్‌కుమార్, లింగారెడ్డి, యాకుబ్ హుస్సేన్, సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పాలకుర్తిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



ప్రజలను మోసం చేయడం కన్నా ఎన్నికల్లో ఓడిపోవడమే మేలు.
- స్టీవెన్‌సన్

మానుకోట.. చైతన్య బాట



తీగల సత్యనారాయణ, జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి, బండి పుల్లయ్య, శ్రీరామ్ భద్రయ్య



వేం నరేందర్‌రెడ్డి, మాలోత్ కవిత, బానోత్ శంకర్‌నాయక్



సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	వచ్చిన ఓట్లు	సమీప అభ్యర్థి	వచ్చిన ఓట్లు
1952	బి.ఎం. చందర్‌రావు(ఎస్‌సీఎఫ్)	14,575	ఎ.రాజయ్య(ఇండిపెండెంట్)	11,334
(ద్విసభ)	కన్నెకంత శ్రీనివాసరావు(పీడీఎఫ్)	26,920	ఎన్.రెడ్డి(కాంగ్రెస్)	11,252
1967	తీగల సత్యనారాయణ(సీపీఐ)	25,635	గండి మల్లికార్జున్‌రావు(కాంగ్రెస్)	22,164
1972	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	53,122	టి. సత్యనారాయణ(సీపీఐ)	10,657
1978	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	24,036	బి. బాబు(కాంగ్రెస్, ఐ)	20,995
1983	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్, ఐ)	35,728	గండు ఐలయ్య(టీడీపీ)	22,187
1985	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	38,690	రావూరి వీరయ్య(టీడీపీ)	31,006
1989	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	46,229	బండి పుల్లయ్య(సీపీఐ)	43,016
1994	బండి పుల్లయ్య(సీపీఐ)	58,797	జన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	48,683
1999	శ్రీరాం భద్రయ్య(టీడీపీ)	46,538	వి. రాజవర్దన్‌రెడ్డి(కాంగ్రెస్)	34,110
2004	వేం నరేందర్‌రెడ్డి(టీడీపీ)	50,373	జె. భరత్ చంద్రారెడ్డి(జనతా)	47,110
2009	మాలోత్ కవిత(కాంగ్రెస్)	66,209	అజ్మీరా చందూలాల్(బీఆర్‌ఎస్)	50,842
2014	బి.శంకర్‌నాయక్(బీఆర్‌ఎస్)	78,370	మాలోత్ కవిత(కాంగ్రెస్)	69,055
2018	బి. శంకర్‌నాయక్(బీఆర్‌ఎస్)	85,397	పి.బలరాంనాయక్(కాంగ్రెస్)	71,863

మొదటి నుంచి వైవిధ్య ఫలితాలే

- ఆరుసార్లు కాంగ్రెస్ విజయం
- టీడీపీ, బీఆర్‌ఎస్, సీపీఐ రెండేసి సార్లు..
- ప్రతిసారి వినూత్న ఓటింగ్
- అంచనాలకు అందని ఫలితాలు

సాక్షి, మహబూబాబాద్: మానుకోట.. చైతన్య బాట. ఇక్కడి మట్టిలోనే చైతన్య పరిమళాలు ఉన్నాయి. నాటి సాయుధ పోరు నుంచి.. నేటి ఎన్నికల పోరు వరకు వినూత్న ఓటింగ్, ఊహించని ఫలితాలకు మానుకోట నియోజకవర్గం నిలయంగా మారుతోంది. చిల్లంచర్ల నియోజకవర్గం నుంచి వేరుపడిన తర్వాత 13 సార్లు జరిగిన ఎన్నికల్లో ఆరుదఫాలు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీతోపాటు భారత రాష్ట్ర సమితి రెండేసి పర్యాయాలు గెలుపొందాయి. 1952 ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న సమయంలో పీడీఎఫ్, ఎస్‌సీఎఫ్‌లు చెరో సీటు గెల్చుకున్నాయి.

ఆరుసార్లు కాంగ్రెస్ విజయం

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మహబూబాబాద్ శాసనసభకు 13సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1972 నుంచి 1989 వరకు జరిగిన వరుస ఎన్నికల్లో జన్నారెడ్డి జనార్దన్ రెడ్డి ఎదురు లేని నాయకుడిగా ఐదు సార్లు గెలుపొంది శాసనభలో ప్రాతినిథ్యం వహించారు. ఇందులో నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగి గెలవగా.. 1983లో జరిగిన ఎన్నికల్లో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఈ నియోకవర్గం ఎస్టీ రిజర్వ్ అయింది. అప్పటి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన మాలోత్ కవిత టీడీపీ అభ్యర్థిపై గెలుపొందారు.

టీడీపీ, బీఆర్‌ఎస్, సీపీఐ రెండేసి సార్లు

మొదటి నుంచి కమ్యూనిస్టుల ప్రభావం ఉన్న నియోజకవర్గం మానుకోట. ఇక్కడ చేపట్టిన ప్రజా ఉద్యమాల ఫలితంగా 1967లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన తీగల సత్యనారాయణ కాంగ్రెస్ అభ్యర్థి గండి మల్లికార్జున్‌పై విజయం సాధించారు. తర్వాత ఐదు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి జన్నారెడ్డి జనార్దన్ రెడ్డి గెలుపొందారు. అయితే 1994లో జరిగిన ఎన్నికలో తిరిగి కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నుంచి పోటీ చేసిన బండి పుల్లయ్య గెలిచి జనార్దన్ రెడ్డి వరుస విజయాలకు అడ్డుకట్టవేశారు. అదే విధంగా 1999 ఎన్నికలో శ్రీరాంభద్రయ్య, 2004ఎన్నికల్లో వేం నరేందర్‌రెడ్డి టీడీపీ నుంచి పోటీ చేసి గెలిచారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత జరిగిన 2014, 2018ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ విజయం సాధించారు.



సీఎం సభకు వచ్చిన వాహనాలపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 27వ తేదీన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన వాహనాల యజమానులపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బాధ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ వై.సతీష్ ఆదివారం రాత్రి తెలిపారు. సీఎం సభకు వచ్చిన వాహనాలకు ఎన్నికల నిబంధనల మేరకు అనుమతులు తీసుకోలేదని ఎంసీసీ బాధ్యులు ఫిర్యాదు చేశారని సీఐ సతీష్ తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

చిట్యాల: మండలకేంద్రంతో పాటు మండలంలోని నవాబుపేట, జూకల్, చల్లగరిగ, గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సీఐ వేణు చందర్, ఎస్సై జంగిలి రమేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాల ప్రభావం ఎలా ఉందో పరిశీలించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి



నిఖిల్ (ఫైల్)

ములుగు రూరల్: పాము కాటుతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా కేంద్రంలో జరిగింది. జిల్లా కేంద్రానికి చెందిన గుంజె స్వాతి, రాజు దంపతులు తమ కుమారుడు నిఖిల్ (12)తో కలిసి ఇంట్లో కింద నిద్రించారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున బాలుడి నోటి నుంచి నురుగు రావడంతో గమనించిన తల్లిదండ్రులు వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గమనించిన వైద్యులు బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. కాగా, ఒక్కగానొక్క కొడుకు పాము కాటుతో మృతి చెందడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు..

వర్ధన్నపేట: తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చిర్ర వెంకటయ్య (70) ఆదివారం సాయంత్రం కల్లు తీయడానికి తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో చెట్టుపై నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పంచనామ నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య కొము రమ్మ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతున్న కౌలు రైతు..

మామునూరు : పంట పెట్టుబడులు రాక, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన కౌలు రైతు దార రాజు(35), లాస్య దంపతులు 8 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో సాగుకు పెట్టిన పెట్టుబడి రాక, ఆర్థిక ఇబ్బందులతోపాటు ఇటీవల భార్య లాస్య పుట్టింటికి వెళ్లడంతో రాజు మనస్తాపానికి గురై శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి ప్రమీల హుటాహుటిన ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సహకారం అందాలి..





సమావేశంలో మాట్లాడుతున్న మహిళలు

జీవనోపాధి కోసం ప్రణాళిక ఉండాలి

- మహిళా సంక్షేమానికి మరింత కృషి చేయాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో కస్తూర్బా మహిళా పొదుపు సంఘం బాధ్యుల స్పష్టీకరణ

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

వ్యాపారం, ఉద్యోగం, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రాధాన్యం కల్పించడంతో పాటు మహిళా సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని నర్సంపేట కస్తూర్బా మహిళా పొదుపు సంఘం బాధ్యులు కోరారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ డిమాండ్లను రాబోయే ప్రభుత్వాల ముందుంచారు. పావలా వడ్డీ రుణాలు, అభయ హస్తం పథకానికి సహకారం అందించి నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలన్నారు. కొత్త ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం ప్రస్తుతం అమలు పరుస్తున్న పథకాలను మరింత పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. - నర్సంపేట

రుణాలు మరింత పెంచాలి



స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు మరిన్ని రుణాలు అందించాలి. రుణాలు ఎంత ఎక్కువగా అందజేస్తే అంత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అందజేస్తున్న రుణాలతో చిన్న వ్యాపారాలు చేసుకోవడానికే సరిపోతోంది.

- నల్లా తేజమ్మ, కస్తూర్బా ఎంపీఎస్ అధ్యక్షురాలు, నర్సంపేట

ప్రాధాన్య పథకాలు అమలు కావాలి



మహిళా సంక్షేమానికి ప్రాధాన్య పథకాల అమలు కావాలి. మహిళా అభివృద్ధికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు. ప్రస్తుతం వ్యాపారం, ఉద్యోగం, తదితర రంగాల్లో బాగానే రాణిస్తున్నప్పటికీ నూతన ఒరవడితో కూడిన పథకాలు తీసుకువస్తే ఇంకా బాగుంటుంది.

- కల్వచర్ల ఉమ, కస్తూర్బా ఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి, నర్సంపేట

మహిళా చట్టాలు పకడ్బందీ చేయాలి



మహిళలకు సమాజంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నా ఆగడాలు తగ్గడం లేదు. ప్రస్తుతం ఉన్న చట్టాలను మరింత కఠినం చేస్తేనే రక్షణ లభిస్తుంది. మహిళలను ఇబ్బందులకు గురిచేసే వారిలో భయం కలగాలంటే మరిన్ని చట్టాలు తీసుకురావాలి.

- మొగిళగాని కవిత, మహిళా సంఘం సభ్యురాలు

చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలి



ప్రభుత్వం మహిళలను వివిధ రంగాల్లో ప్రోత్సాహిస్తోంది. అయితే మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలంటే చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహాలు పెంచాలి. బ్యాంకుల ద్వారా ప్రత్యేక రుణాలు అందించాలి. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

- పొగుల్ల వాణి, మహిళా సంఘం సభ్యురాలు

వడ్డీ లేని రుణాలు అందజేయాలి



మహిళలు ఏ రంగంలోనైనా రాణించడానికి ముందుకు వస్తున్నారు. ఇందుకు ప్రభుత్వాల నుంచి సహకారం కోరుకుంటున్నారు. ఇందు కోసం వడ్డీ లేని రుణాలు అందజేస్తే ఎంచుకున్న రంగంలో రాణించి ఆర్థికంగా బలోపేతం కావొచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న రుణాలు పెంచి వడ్డీ లేకుండా చర్యలు చేపట్టాలి.

- నల్ల రజిత, మహిళా సంఘం సభ్యురాలు

రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాలి



మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయితే రాజకీయాల్లో కూడా రాణించడానికి ఎక్కువ అవకాశాలు కల్పించాలి. తద్వారా మహిళా రక్షణకు ప్రత్యేక ఆలోచన వచ్చే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. అప్పుడే మహిళా సాధికారత లభించినట్లు.

- గన్నోజు రేణుక, మహిళా సంఘం సభ్యురాలు

ఉపాధి అవకాశాలు కల్పించాలి



ప్రభుత్వాలు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. అయితే గ్రామ, పట్టణ స్థాయికి వచ్చే సరికి అంతంతమాత్రంగానే లభిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వచ్చే ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు మరింత పెంచితే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారు.

- మడిపెద్ది శ్రీదేవి, ప్రైవేట్ ఉపాధ్యాయురాలు

బాలిక సంరక్షణకు కృషి చేయాలి



గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. అయినా కొన్ని చోట్ల జరుగుతూనే ఉన్నాయి. వీటిని నియంత్రించడానికి గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యచరణ చేపట్టాలి. అధికారులు, ప్రజాప్రతిధులు బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

- పరావస్తు ప్రసన్న, మహిళా సంఘం సభ్యురాలు

పావలా వడ్డీ రుణాలు అందించాలి



కొందరి మహిళలకే పావలా వడ్డీ రుణాల అమలు జరుగుతోంది. అధిక శాతం మహిళలకు అందకపోవడంతో బ్యాంకులకు వడ్డీతో చెల్లించాల్సి వస్తోంది. ప్రతీ మహిళా సంఘానికి పావలా వడ్డీ రుణం అందించి ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

- బోగోజు సంధ్య, టైలర్

నిత్యావసరాలను నియంత్రించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలు నియంత్రించకపోవడంతో మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించి వచ్చే ప్రభుత్వాలు నిత్యావసరాలపై ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్తే మధ్య తరగతి వాసులు ఇబ్బంది లేకుండా జీవనం కొనసాగించొచ్చు.

- నల్ల దివ్య, గృహిణి

అక్షరాస్యతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనేక మంది వివిధ కారణాలతో చదువుకోవడం లేదు. మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చేస్తున్న చర్యలు సరిపోవడంలేదు. వచ్చే ప్రభుత్వాలు మహిళలను అక్షరాస్యులుగా చేసే బాధ్యతలో మరిన్ని చర్యలు చేపట్టాలి.

- దూపటి ప్రియాంక, గృహిణి

రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి



మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయి. కానీ వాటి అమలు, వినియోగంపై మహిళలకు అవగాహన లేకుండాపోతుంది. రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పిస్తే ప్రయోజనం లభిస్తుంది.

- పొగుల్ల నవ్య, మహిళ

ఎండు గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా రైలులో తరలిస్తున్న 7 కిలోల శుద్ధి చేసిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్ర మోహన్ తెలిపారు. కాజీపేట పట్టణ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో పోలీసులను చూసిన నిందితులు పరారీ కాగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణంలో మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే 8712659020 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, సిబ్బంది ఖలీల్, రవీందర్, లాలయ్య, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

సినిమాల్లో అవకాశాలు రాలేదని యువకుడి ఆత్మహత్య



సాయి ప్రకాశ్ (ఫైల్)

కాజీపేట: సినిమాల్లో సరైన పాత్రలు లభించడం లేదనే కారణంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు.. వడ్డేపల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం వెలుగుచూసింది. కాజీపేట సీఐ సార్ల రాజు కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లా మార్తాండ నగర్ గ్రామానికి చెందిన పిల్లి సాయి ప్రకాశ్(26) పలు సినిమాల్లో చిన్న పాత్రల్లో నటించాడు. అయితే ఇప్పటి వరకూ సరైన అవకాశాలు దక్కలేదు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం భద్రాచలం వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పాడు. అయితే భద్రాచలం వెళ్లకుండా హనుమకొండ జిల్లా కేంద్రానికి చేరుకుని హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంలో స్థిరపడే అవకాశం రాలేదనే మనస్తాపంతో ఈ నెల 28న వడ్డేపల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు సీఐ రాజు వివరించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

రఘునాథపల్లి : కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కోమళ్లలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోమళ్లకు చెందిన బండి స్వామి(28) గీతవృత్తితో పాటు కూలీ పనులకు వెళ్తుంటాడు. కొన్నాళ్లుగా స్వామి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. కాగా, శనివారం అతిగా మద్యం తాగడంతో భార్య రాధిక స్వామిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన స్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

స్వామి మృతి సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కోమళ్లకు చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మేకల వరలక్ష్మి, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, కోమళ్ల రవిగౌడ్ తదితరులు ఉన్నారు.